నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
I | హైదరాబాద్, బుధవారం 29 జనవరి 2025 | SANGAREDDY

## చెక్కుల పంపిణీ రద్దు చేయడం తగదు



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చిలిపిచెడ్, జనవరి 28: మెదక్ జిల్లా చిలిపిచెడ్ మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంగళవారం చిలిపిచెడ్‌లో నియోజకవర్గ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి చేతుల మీదుగా కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేశారు. ఏమైందో ఏమో కాని ఈ కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు తహసీల్దార్ ప్రకటించారు. కార్యక్రమం రద్దు చేయడంతో బీఆర్ఎస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డిని కాదని జిల్లా మంత్రి చేతుల మీదుగా చెక్కులు పంపిణీ చేసేందుకు కార్యక్రమాన్ని వాయిదా వేయడం మంచి పద్ధతి కాదన్నారు. కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీకి హాజరయ్యే మంత్రి ప్రతి లబ్ధిదారుకు చెక్కుతో పాటు తులం బంగారం తీసుకొని రావాలని, తీసుకు రాకపోతే మంత్రిని అడ్డుకుంటామని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, రైతుబంధు సమితి మండల మాజీ అధ్యక్షుడు రాజిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. కార్యక్రమం రద్దు చేయడంతో మంగళవారం తహసీల్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ నాయకులు ధర్నా చేశారు. సీఎం డౌన్ డౌన్, కాంగ్రెస్ పాలన దొంగల పాలన అంటూ నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్ ముసాద్దీక్‌కు వినతి పత్రం అందజేశారు. మంత్రి చేతుల మీద చెక్కులు పంపిణీ చేయాలని కలెక్టర్ నుంచి ఆదేశాలు రావడంతో చెక్కుల పంపిణీ కార్యక్రమం రద్దు చేశామని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు మధుసూదన్ రెడ్డి, గోపాల్‌రెడ్డి, శంకర్‌నాయక్, భిక్షపతి నాయక్, పోచయ్య, బీఆర్ఎస్ నాయకులు కిషన్‌రెడ్డి, విఠల్, వెంకట్‌రెడ్డి, వీరాస్వామి, అంబర్‌సింగ్ పాల్గొన్నారు.

## కూడవెల్లిలోకి నీరు విడుదల చేయాలి

**మంత్రికి దుబ్బాక ఎమ్మెల్యే విజ్ఞప్తి**

మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, జనవరి 28: దుబ్బాక నియోజకవర్గంలో సాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మంగళవారం భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. కూడవెల్లి వాగులోకి నీరు విడుదల చేయకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని మంత్రి దృష్టికి తెచ్చారు. మాఘ అమావాస్య సందర్భంగా బుధవారం కూడవెల్లి దేవస్థానానికి భారీ సంఖ్యలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించడానికి వస్తారని, వెంటనే వాగులోకి నీటిని విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. రామాయంపేట, చిన్న శంకరంపేట కాల్వల్లోకి నీటిని విడుదల చేయాలని ఎమ్మెల్యే కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించి బుధవారంలోగా వాగులోకి నీటిని విడుదల చేసేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఇందుకు మంత్రికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

# కంది రైతు..రంది!

**పరేషాన్‌లో కంది రైతులు**

- ఎకరాకు 3.30 క్వింటాళ్లు మాత్రమే ప్రభుత్వం కొనుగోలు
- ఎకరాకు 7 క్వింటాళ్ల వరకు దిగుబడులు
- మిగతా కందులు ఎక్కడ అమ్మాలని రైతుల ప్రశ్న
- ప్రభుత్వ కొర్రీలపై రైతుల ఆగ్రహం
- పేరుకే కంది కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- వారం రోజులైనా సేకరణ ప్రారంభం కాలేదు
- మార్కెట్‌లోనే రైతుల పడిగాపులు

సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డుకు తెచ్చిన కందులు

వారం రోజులైనా కొనుగోలు చేయడం లేదంటున్న కంది రైతులు

సిద్దిపేట, జనవరి 28( నమస్తే తెలంగాణ ప్రతినిధి): కంది రైతులకు రంది పట్టుకుంది. పండించిన పంటను అమ్ముకోవడానికి రైతులకు తిప్పలు తప్పడం లేదు. రైతులకు దన్నుగా నిలవాల్సిన ప్రభుత్వం పట్టించుకోనట్లుగా వ్యవహరిస్తున్నది. పంట సాగు మొదలు.. పంట అమ్మకం వరకు రైతులకు ఇబ్బందులే ఎదురవుతున్నాయి. పంట పండించడం రైతుకు ఒక ఎత్తయితే.. ఆ పంటను అమ్ముకోవడానికి రైతులకు తిప్పలు తప్పడం లేదు. ఆరుగాలం కష్టపడి పండించిన కంది పంట చేతికి వచ్చినా రైతులకు సంతోషం లేకుండా పోయింది. ప్రభుత్వం కొర్రీలు పెట్టి సేకరణను ఆలస్యం చేస్తుండడంతో రైతులకు పడిగాపులు తప్పడం లేదు. వారం పది రోజులుగా కొనుగోలు కేంద్రాల వద్దనే కంది రైతులు పడిగాపులు కాస్తున్నారు. ఈసారి ఎకరాకు 3.30 క్వింటాళ్ల వరకే కంది పంటను సేకరించాలని ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలకు ఆదేశాలు జారీ చేసింది. ఎకరాకు సరాసరిగా 6 నుంచి 8 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తున్నది. దీంతో మిగతా పంటను ఎక్కడ అమ్ముకోవాలని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ తీరుపై రైతులు మండి పడుతున్నారు.

### వేల ఎకరాల్లో సాగు...

సిద్దిపేట జిల్లాలో ఈసారి కంది 6500 ఎకరాల్లో సాగైంది. జిల్లా వ్యాప్తంగా పంట దిగుబడి చేతికి వచ్చింది. కొన్ని ప్రాంతాల్లో కోత పనులు నడుస్తున్నాయి. నెల రోజుల ముందే కంది పంటను కొనుగోలు చేయాలని రైతుల పక్షాన ప్రభుత్వానికి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు లేఖ రాశారు. దీంతో ఈనెల 17న కంది కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సిద్దిపేట మార్కెట్ యార్డులో ప్రారంభించారు. జిల్లాలో సిద్దిపేటతో పాటు చేర్యాలలో కంది కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. క్వింటాల్‌కు రూ. 7,550 మద్దతు ధరను రైతులకు చెల్లిస్తున్నారు. ఇదే సమయంలో కంది రైతులకు అనేక అంక్షలను ప్రభుత్వం పెట్టింది. ఎకరాకు 3.30క్వింటాళ్ల వరకే కొనుగోలు చేయాలని కేంద్రాల నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేసింది.ఎకరాకు ఎంత లేదన్నా 8 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తున్నది. కంది చేను దెబ్బతింటే దిగుబడి 4 నుంచి 5 క్వింటాళ్ల వరకు వచ్చే అవకాశం ఉంది. కానీ, ప్రభుత్వం పరిమితులు విధించడంతో రైతులు దిగులు చెందుతున్నారు.

**నత్తనడకన కొనుగోళ్లు...**

జిల్లాలో కందుల కొనుగోళ్లు నత్తనడకన జరుగుతున్నాయి. వారం పది రోజుల నుంచి రైతులు కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. తేమ శాతం పేరిట రైతులను ఇబ్బంది పెడుతున్నారు. కంది కోతలు పూర్తి అవుతుండడంతో మార్కెట్‌కు రైతులు కందులు తీసుకు వస్తున్నారు. ఇప్పటి వరకు కొంతమంది రైతుల కందులు మాత్రమే కొనుగోలు చేశారు. ఎక్కువ శాతం మార్కెట్‌లోనే కందులు ఉండిపోతున్నాయి. నానా కొర్రీలు పెడుతూ కందులు కొనుగోలు చేయడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. తేమ శాతం సరిగ్గా లేదని అధికారులు కందులను కొనుగోలు చేయడం లేదని రైతులు తెలిపారు. వారం రోజులుగా కేంద్రాల్లోనే పడిగాపులు కాస్తున్నామని, రోజు కందులను ఆరబోస్తూ అక్కడే ఉంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

## బీఆర్ఎస్ హయాంలో ఉద్యోగులకు న్యాయం

**నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి**

మెదక్‌లో టీఎన్జీవో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, కలెక్టర్ రాహుల్‌రాజ్ తదితరులు

- మెరుగైన పీఆర్సీ ఇచ్చిన ఘనత కేసీఆర్‌దే: ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి
- టీఎన్జీవో స్టాండింగ్ కౌన్సిల్ సమావేశం, డైరీ క్యాలెండర్ ఆవిష్కరణ

మెదక్, జనవరి 28 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ హయాంలో ఉద్యోగులకు న్యాయం జరిగిందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. మంగళవారం మెదక్‌లోని టీఎన్జీవో భవన్‌లో సంఘం జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ అధ్యక్షతన నిర్వహించిన స్టాండింగ్ కౌన్సిల్ సమావేశం, డైరీ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో టీఎన్జీవో పాత్ర వెలకట్టలేదని గుర్తు చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధుల మధ్య కిందిస్థాయి ఉద్యోగస్తులు నలిగిపోతున్నారని, మన ఉద్యోగాలు మనకు దక్కాలనే ఉద్దేశంతో కేసీఆర్ జోనల్ వ్యవస్థ తీసుకువచ్చారని తెలిపారు. మెదక్ జిల్లాను చార్మినార్ జోన్‌లో కలిపేలా తాను కృషి చేస్తానని పేర్కొన్నారు. పెండింగ్ బిల్లులు, ఆరోగ్య భద్రత విషయంలో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని సునీతా లక్ష్మారెడ్డి చెప్పారు. అనంతరం ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ... ఉద్యోగులకు 43శాతం పీఆర్సీ ఇచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. తెలంగాణ ఏర్పాటులో టీఎన్జీవోల పాత్ర మరువలేనిదని పేర్కొన్నారు. టీఎన్జీవో రాష్ట్ర మాజీ అధ్యక్షుడు దేవీప్రసాద్ మాట్లాడుతూ.. టీఎన్జీవోల సంఘం ఉద్యోగుల హక్కుల పరిరక్షణ సంక్షేమమే కాకుండా ప్రజల ఆశయాలు, ఆకాంక్షల మేరకు పోరాడిన ఏకైక సంఘం టీఎన్జీవో అన్నారు. జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ ఆధ్వర్యంలో మూడు ప్రధాన అంశాలపై తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, కలెక్టర్ రాహుల్‌రాజ్, టీఎన్జీవో జిల్లా కార్యదర్శి మినికే రాజ్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అనురాధ, పూర్వపు మెదక్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నూతన మెదక్ జిల్లా మాజీ అధ్యక్షుడు శ్యామ్‌రావు, జిల్లా సహాధ్యక్షులు ఇక్బాల్ పాషా, కోశాధికారి చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు ఫణిరాజ్, ఫజలుద్దీన్, ఎంకెటి అర్షద్, రఘునాథరావు, లీల, సంయుక్త కార్యదర్శులు, పోతురాజు శంకర్, శివాజీ, కిరణ్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ విష్ణువర్ధన్ రెడ్డి, ప్రచార కార్యదర్శి నర్సింలు, క్రీడల కార్యదర్శి గోపాల్, కార్యవర్గ సభ్యులు మరియా, సతీష్, సలావుద్దీన్, మెదక్, నర్సాపూర్, రామాయంపేట, తూప్రాన్, అల్లాదుర్గం, ఏడుపాయల వనదుర్గ, చేగుంట యూనిట్ల అధ్యక్ష, కార్యదర్శులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఐబీ తండాలో అనర్హులకు పథకాలు

- విచారణకు ఆదేశించిన మంత్రి దామోదర రాజనర్సింహ

అల్లాదుర్గం, జనవరి 28: అనర్హులకు పథకాలు అందుతుండడంతో అర్హులు గగ్గోలు పెడుతున్నారు. అర్హులను విస్మరించి ప్రభుత్వ ఉద్యోగి కుటుంబానికి, పెండ్లికాని యువతకు, చదువుకుంటున్న విద్యార్థులకు సంక్షేమ పథకాలను మంజూరు చేశారని ఆరోపిస్తూ మంత్రి దామోదర రాజనర్సింహకు ఫిర్యాదులు అందాయి. దీంతో విచారణ జరిపించాలని జిల్లా కలెక్టర్‌ను మంత్రి ఆదేశించారు. మంజూరైన రెండు రోజుల్లోనే ఎంపికైన లబ్ధిదారులపై మంగళవారం మళ్లీ సర్వే నిర్వహించారు. ఇదంతా ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అందోల్ నియోజకవర్గంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి... నాలుగు ప్రభుత్వ పథకాలను అందించడానికి మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలంలోని ఐబీ తండాను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. ఇటీవల సర్వే నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేశారు. ప్రభుత్వం సూచించినట్లుగా గణతంత్ర దినోత్సవం 26న లబ్ధిదారులకు పథకాల ప్రొసీడింగ్స్ అందచేశారు. 10 మందికి రేషన్ కార్డులు, 20మంది రైతులకు రైతు భరోసా, 14మందికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, 9మందికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసినట్లు ప్రొసీడింగ్స్ అందజేశారు. అయితే లబ్ధిదారుల ఎంపికలో అక్రమాలు జరిగాయని, అర్హులను వదిలేసి అనర్హులకు పథకాలను మంజూరు చేశారని తండా వాసులు ఆరోపిస్తూ ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు మొర పెట్టుకున్నారు. దీనిపై స్పందించిన మంత్రి ఐబీ తండాలో పథకాలకు ఎంపికైన లబ్ధిదారుల విషయంలో విచారణ చేపట్టాలని కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు తండాలో లబ్ధిదారుల ఎంపికపై విచారణ చేపట్టారు. ఈ విషయమై ఎంపీడీవో చంద్రశేఖర్‌ను వివరణ కోరగా, జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశాల మేరకు విచారణ చేపట్టినట్లు తెలిపారు. ఎంపికైన లబ్ధిదారుల్లో కొందరు అనర్హులు ఉన్నట్లు విచారణలో తేలిందన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్‌కు విచారణ నివేదికను అందిస్తామని తెలిపారు.

## అందోల్ అభివృద్ధికి ప్రణాళికలు

- మున్సిపల్ అభివృద్ధిపై సమీక్షలో మంత్రి

సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి దామోదర

అందోల్, జనవరి 28: అందోల్-జోగిపేట మున్సిపాలిటీని అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖల మంత్రి దామోదర రాజనర్సింహ సూచించారు. మంగళవారం అందోల్-జోగిపేటలో పర్యటించిన మంత్రి పలు అభివృద్ధి పనులను పరిశీలించడంతో పాటు మున్సిపల్ అభివృద్ధిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందోల్ పట్టణానికి తలమానికమైన ట్యాంక్‌బండ్‌ను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలన్నారు. పర్యాటకుల కోసం బోటింగ్, రెస్టారెంట్ ఏర్పాటు చేయాలని, బ్యూటీఫికేషన్, వాకింగ్ ట్రాక్ నిర్మాణం చేపట్టాలన్నారు. ఆధునిక లైబ్రరీ, మున్సిపల్ ఆఫీస్ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. గాంధీపార్కును ఆధునీకరించాలని, ఎన్టీఆర్ మైదానంలో వాలీబాల్, ఫుట్‌బాల్, క్రికెట్ గ్రౌండ్, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించి మల్టీపర్పస్ స్టేజీని నిర్మించాలన్నారు. టీయూఎఫ్‌ఐడీసీ ద్వారా రూ. 30.20 కోట్లతో చేపడుతున్న పనులు త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. అనంతరం ఎంఫార్మసీ కళాశాల, ఇతర విద్యాసంస్థల ఏర్పాటు కోసం స్థలాలను మంత్రి పరిశీలించారు. సమీక్షలో ఆర్డీవో పాండు, పబ్లిక్ హెల్త్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ తిరుపతికుమార్, మున్సిపల్ కమిషనర్ తిరుపతి, తహసీల్దార్ విష్ణుసాగర్, డీటీ మధుకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## కర్నాల్‌పల్లి ఎల్లమ్మ మహిమగల్ల దేవత

- మెదక్ అడిషనల్ కలెక్టర్ నగేశ్

శ్రీరేణుకా ఎల్లమ్మ మాతను దర్శించుకున్న మెదక్ అదనపు కలెక్టర్ మెంచు నగేష్

చేగుంట, జనవరి 28: కర్నాల్‌పల్లి ఎల్లమ్మ దేవత మహిమగల్ల దేవత అని, అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు కోరికలు నెరవేరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసమని మెదక్ అదనపు కలెక్టర్ మెంచు నగేశ్ పేర్కొన్నారు. ఈ దేవాలయ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం సాయంత్రం ఆయన అమ్మవారిని దర్శించుకున్నారు. దేవాలయానికి వచ్చిన అదనపు కలెక్టర్‌కు దేవాలయ కమిటీ చైర్మన్ జనగామ రాములుగౌడ్, కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

సమావేశంలో మాట్లాడుతున్న సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి

- సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట కలెక్టరేట్, జనవరి 28: పదో తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికాబద్ధంగా విద్యార్థులను సన్నద్ధం చేయాలని సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. మార్చి 21 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షల సన్నద్ధతపై మంగళవారం కలెక్టర్ సమావేశ మందిరంలో హెచ్ఎంలు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాళ్లు, కేజీబీవీల ప్రత్యేకాధికారులతో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల వారీగా అనుసరిస్తున్న విధానం గురించి హెచ్ఎంలు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పరీక్షలకు నెలన్నర సమయం మాత్రమే ఉన్నందున, ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. విద్యార్థులు స్వేచ్ఛగా చదివే అవకాశం కల్పించాలని సూచించారు. విద్యార్థులకు మంచి భోజనం పెట్టాలన్నారు. విద్యార్థులు ఆందోళనకు గురికాకుండా ఉపాధ్యాయులు, హెచ్ఎంలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో ఉమ్మడి పరీక్ష సెక్రటరీ షౌకత్ ఆలీ, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మయ్య, విద్యాశాఖ సెక్టోరల్ అధికారి రామస్వామి, ఎంఈవోలు, జిల్లా విద్యాశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జీపీ టూ బల్దియా

**సంగారెడ్డి జిల్లాలో నాలుగు కొత్త మున్సిపాలిటీలు ఏర్పాటు**

- ఇస్నాపూర్, గడ్డపోతారం, గుమ్మడిదల, కోహీర్‌లో మున్సిపల్ పాలన
- ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్లకు బాధ్యతలు
- మున్సిపాలిటీల్లో విలీనంపై తీర్మానాలు చేసిన పంచాయతీలు
- ప్రజాభిప్రాయాలకు వ్యతిరేకంగా మున్సిపాలిటీల ఏర్పాటు
- మున్సిపాలిటీల్లో మొదలైన ప్రత్యేకాధికారుల పాలన



గుమ్మడిదల మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన రఘు, అకౌంటెంట్ ప్రగతిని సన్మానిస్తున్న జీపీ కార్యదర్శులు

పటాన్‌చెరు/ గుమ్మడిదల/ జిన్నారం (బొల్లారం) / కోహీర్, జనవరి 28: సంగారెడ్డి జిల్లాలో నాలుగు కొత్త మున్సిపాలిటీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. జహీరాబాద్ నియోజకవర్గంలోని కోహీర్‌ను కొత్త మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. పటాన్‌చెరు నియోజకవర్గంలోని గడ్డపోతారం, ఇస్నాపూర్, గుమ్మడిదల కేంద్రంగా మరో మూడు కొత్త మున్సిపాలిటీలు ఏర్పాటయ్యాయి. మున్సిపాలిటీల పాలకవర్గాల గడువు ముగియడంతో ప్రభుత్వం ప్రత్యేకాధికారుల పాలనా బాధ్యతలు అప్పగించింది. ఇస్నాపూర్, గడ్డపోతారం, గుమ్మడిదల పరిసర గ్రామాలను కలుపుతూ మున్సిపాలిటీలుగా ప్రకటించారు. ఇస్నాపూర్, చిట్కుల్, పాశమైలారం గ్రామాలు ఇస్నాపూర్ మున్సిపాలిటీగా, గుమ్మడిదల, బొంతపల్లి, వీరన్నగూడెం, దోమడుగు, అన్నారం గ్రామాలతో గుమ్మడిదల మున్సిపాలిటీగా, గడ్డపోతారం, కాజీపల్లి, మాధారం, వావిలాల, లక్ష్మీపతిగూడెంతో గడ్డపోతారం మున్సిపాలిటీ ఏర్పాటు చేశారు. తమ గ్రామాలను మున్సిపాలిటీలు చేయవద్దని పలు గ్రామాల ప్రజలు, పంచాయతీలు ఏకగ్రీవ తీర్మానాలు చేసినా అధికారులు పట్టించుకోలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. గడ్డపోతారంలో ఐదు పంచాయతీలు, ఇస్నాపూర్‌లో మూడు పంచాయతీలు, గుమ్మడిదలలో ఐదు పంచాయతీలు మున్సిపాలిటీల్లో విలీనం చేశారు. 1952 నుంచి 1967 వరకు మున్సిపాలిటీగా ఉన్న కోహీర్ జనాభా తగ్గడంతో మేజర్ గ్రామ పంచాయతీగా మార్చారు. ప్రస్తుతం 21వేల వరకు జనాభా పెరగడంతో మంగళవారం మరోసారి కోహీర్‌ను మున్సిపాలిటీగా ప్రభుత్వం ఏర్పాటు చేయడంతో గ్రామస్తులు మిఠాయిలు తినిపించుకున్నారు.

### కోహీర్ మున్సిపల్ కమిషనర్‌గా ఉమామహేశ్వర్‌రావు...

కోహీర్ మున్సిపల్ కమిషనర్‌గా ఉమామహేశ్వర్‌రావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పట్టణ ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం కోహీర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి మహ్మద్ మిస్కీన్ నుంచి రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. తర్వాత మున్సిపల్ కార్యాలయంలో ఏఈగా హరీశ్, పట్టణ ప్లానింగ్ అధికారిగా నరేశ్, అకౌంటెంట్‌గా లక్ష్మి బాధ్యతలు స్వీకరించారు. అధికారులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు.

### ఇస్నాపూర్ మున్సిపల్ కమిషనర్‌గా జ్యోతిరెడ్డి...

ఇస్నాపూర్ మున్సిపాలిటీకి కొత్త కమిషనర్‌గా జ్యోతిరెడ్డిని ఇన్‌చార్జిగా బాధ్యతలు కేటాయించారు. జ్యోతిరెడ్డి అమీన్‌పూర్ మున్సిపాలిటీలో కమిషనర్‌గా పనిచేస్తున్నారు. గ్రామ పంచాయతీల రికార్డులను మున్సిపల్ కమిషనర్ స్వాధీనం చేసుకోవాల్సి ఉంది. సీడీఎంఏ నుంచి ఆదేశాలు రావడంతో మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌లుగా బాధ్యతలు తీసుకుంటున్నారు. మున్సిపాలిటీల్లో ఇన్‌చార్జి కమిషనర్లతో పాటు ప్రత్యేకాధికారులు బాధ్యతలు తీసుకుంటారు. రికార్డులు అప్పగించాలని మరోవైపు పంచాయతీలకు కలెక్టరేట్ నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని సమాచారం. బుధవారం కలెక్టర్ నుంచి ఆదేశాలు వచ్చే అవకాశం ఉందని అనుకుంటున్నారు. ప్రస్తుతం పంచాయతీల ఆన్‌లైన్ ఎన్ఐసీని నిలిపివేశారు. విలీనం ప్రక్రియ పూర్తయిన తరువాత మున్సిపాలిటీ ఆన్‌లైన్ సేవలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయి.



కోహీర్‌లో బాధ్యతలు స్వీకరించిన అనంతరం మాట్లాడుతున్న కమిషనర్ ఉమామహేశ్వర్‌రావు

గడ్డపోతారం ఇన్‌చార్జి కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న మంగతాయారు

### గుమ్మడిదల బల్దియా కమిషనర్‌గా జి.రఘు

బడంపేట మున్సిపల్ కమిషనర్ జి.రఘు మంగళవారం గుమ్మడిదల బల్దియా కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. కమిషనర్‌తో పాటు అకౌంటెంట్ ప్రగతి బాధ్యతలు స్వీకరించారు. వీరిని ఐదు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ప్రభాకర్, నారాయణ, రాములు, ప్రత్యూషా, సంగీత వారిని శాలువాతో సన్మానించారు. అనంతరం గుమ్మడిదల, దోమడుగు, బొంతపల్లి, వీరన్నగూడెం, అన్నారం గ్రామ పంచాయతీల జీపీ కార్యదర్శులతో సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆ గ్రామాల్లోని రికార్డులను మున్సిపల్ కమిషనర్ స్వాధీనం చేసుకున్నారు.

### గడ్డపోతారం కమిషనర్‌గా మంగతాయారు

జిన్నారం మండలంలో గడ్డపోతారం గ్రామాన్ని మున్సిపాలిటీగా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మున్సిపాలిటీ ఇన్‌చార్జి కమిషనర్‌గా మంగతాయారు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటికే ఆమె బొల్లారం మున్సిపాలిటీ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గడ్డపోతారం మున్సిపాలిటీలో కాజిపల్లి, మాదారం, వావిలాల, లక్ష్మీపతిగూడెం గ్రామాలతో పాలన ప్రారంభమైంది. గ్రామ పంచాయతీకి సంబంధించిన 9ప్రొఫార్మా రికార్డులను మున్సిపల్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గ్రామ పంచాయతీ ఎన్ఐసీ ఆన్‌లైన్ లాగిన్స్ ఆఫ్ చేశారు. ఇన్‌చారి కమిషనర్ పేరిట లాగిన్స్ ఇచ్చి, పరిపాలన కొనసాగించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. గడ్డపోతారం మున్సిపాలిటీ ప్రత్యేక అధికారిగా సంధ్య బాధ్యతలు స్వీకరించారు.

## మల్లన్న క్షేత్రంలో మహిళా అఘోరి హల్‌చల్

మల్లన్న ఆలయ రాజగోపురం వద్ద మహిళా అఘోరి

చేర్యాల, జనవరి 28 : సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లికార్జున స్వామి క్షేత్రంలో మంగళవారం మహిళా అఘోరి హల్‌చల్ చేసింది. స్వామివారి దర్శనానికి వచ్చిన ఆమెకు ఆలయ ప్రధాన ద్వారం నుంచి దర్శనం చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని ఆలయ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. స్వామి వారి దర్శనానికి దిగంబరంగా అనుమతి ఇవ్వమని, వస్త్రాలు ధరించి రావాలని ఆలయవర్గాలు సూచించడంతో ఆలయం నుంచి కిందకు వచ్చి కారులో కొంతసేపు కూర్చుంది. ఆ సమయంలో కారులో ఉన్న కత్తి తీసుకుని కిందకు దిగి భక్తులపై కత్తి దూయడంతో ఒక్కసారిగా భక్తులు పరుగులు తీశారు. పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని ఆమెను శాంతింపజేసేందుకు యత్నించారు. వినకుండా ఆలయ ప్రధాన ద్వారం వద్దకు వెళ్లి తలుపులకు వేసి ఉన్న తాళాన్ని కత్తితో పగులగొట్టేందుకు తీవ్రంగా యత్నించి విఫలమైంది. ఈ సందర్భంగా వీడియో తీస్తున్న మీడియా వ్యక్తికి చెందిన సెల్‌ఫోన్‌పై కత్తితో కొట్టడడంతో మొబైల్ ఫోన్ పగిలిపోయింది. అనంతరం ఆలయ వర్గాల విజ్ఞప్తితో మహిళా అఘోరి వస్త్రాలు ధరించి స్వామి వారిని దర్శించుకుని కారులో వెళ్లిపోయింది.